www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 21 జూన్ 2025
5
తిరుపతి



గోబ్యాక్ 'మోడీ గోబ్యాక్' : సిపిఎం

ప్రజాశక్తి - రేణిగుంట



అంతర్జాతీయ ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని విశాఖ పర్యటనకు విచ్చేస్తున్న ప్రధాని మోడీ పర్యటనను నిరసిస్తూ రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 'మోడీ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఏరియా కార్యదర్శి హరినాథ్ మాట్లాడుతూ మోడీ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. ఆంధ్రుల ప్రతిష్టాత్మకమైన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేస్తూ 'యోగాదినం' పేరుతో లక్షలాది మందితో ఈవెంట్ నిర్వహించడం ప్రజలను వంచించడమేనని అన్నారు.కరీముల్లా, సెల్వరాజ్, ఎంపిటిసి రాజేశ్వరి, రంగయ్య, రాజశేఖర్, భారతి, ఈశ్వరి, పద్మ, మునస్వామి, ఒ.వెంకటరమణ పాల్గొన్నారు.

బలవంతపు బడుల విలీనాన్ని ఆపండి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ / పివిపురం, కెవిబిపురంలలో నిరసనలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం, కెవిబిపురం

'స్కూల్ చైర్మన్‌కు తెలియకుండానే బలవంతంగా పాఠశాలను విలీనం చేయడం ఏంటి' అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ ప్రశ్నించారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం పివిపురం పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కూలును విలీనం చేయొద్దంటూ నిరసన తెలిపారు. 'మా స్కూలు మాకే కావాలి' అంటూ విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేశారు.



కెవిబిపురంలో విద్యార్థుల ర్యాలీ

కెవిబిపురం మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలల రద్దుకు నిరసనగా గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల చదువుకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రభుత్వం చెప్పినట్లు పాఠశాలలను రద్దు చేస్తూ విద్యాశాఖాధికారులు విద్యార్థుల డ్రాపౌట్‌కు కారకులవుతున్నారని మండిపడ్డారు. విలీనం నిర్ణయం వల్ల గురుకుల కండ్రిగ, వగత్తూరు, బంగారమ్మకండ్రిగ లాంటి గ్రామాల విద్యార్థులకు విద్యకు దూరమౌ నిరక్షరాసులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. గురుకుల కండ్రిగ గ్రామస్తులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తక్షణమే పాఠశాల విలీనం ఆపి, పాఠశాలను తెరిపించాలని డిమాండ్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థులు నాలుగైదు కిలోమీటర్ల దూరం నడచి చదువుకోవడం సాధ్యమయ్యే పనేనా అని ప్రశ్నించారు.

మారణహోమాన్ని ప్రతిఘటించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

సామ్రాజ్యవాద ధోరణితో సాగుతున్న యుద్ధ మారణకాండను ప్రతిఘటించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. పాలస్తీనాకు సంఘీభావంగా'యుద్ధాలు- ప్రభావాలు' అంశంపై బాలాజీ కాలనీలోని మేక్‌మై బేబీ జీనియస్ పాఠశాలలో సెమినార్ జరిగింది. ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్ జెండాను ఆవిష్కరించారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పాలస్తీనాపై దుర్మార్గంగా దాడులు చేస్తూ మహిళలు, చిన్నారుల ప్రాణాలను బలిగొనడం అత్యంత అమానుషం అన్నారు. అమెరికాలోని మిట్ వార్షికోత్సవ సభలో విద్యార్థి వేమూరి మేఘన, పర్యావరణ ఉద్యమకారిణి గ్రేట్ థన్‌బర్గ్‌లు పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధాన్ని ప్రశ్నించారన్నారు. ఇదే స్ఫూర్తితో మనం కూడా ప్రపంచంలో జరిగే మారణహోమాన్ని ప్రతిఘటించాలన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు వి.నాగరాజు మాట్లాడుతూ వేమూరి లాంటి ప్రశ్నించే శక్తులుగా విద్యార్థులు మారాలన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ ఆకలితో, అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతున్న నిస్సహాయులకు ఐక్యరాజ్యసమితి తక్షణం నిత్యావసరాలు అందించాలని, ఇజ్రాయిల్‌ను ఒంటరిపాటు చేయాలన్నారు. అశోక్, వినోద్, శివ, గణేష్ పాల్గొన్నారు.



అఖిల భారత మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నేడే 'యోగా' డే

జయప్రదం చేయాలని కలెక్టర్ పిలుపు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రపంచ 11వ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని శ్రేణులకు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి శనివారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు ఏర్పాట్లపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతనెల 21వ తేదీ నుంచి జూన్ 21 వరకూ యోగాంధ్ర-2025 క్యాంపెయిన్ నిర్వహించామన్నారు. శనివారం జిల్లాలో 6,200 ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. ప్రతి వెన్యూ వద్ద చక్కటి పబ్లిక్ అడ్రస్సు సిస్టంను, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం 10 గంటల్లోపే ఫొటోలు, వీడియోలు సంబంధిత ఆప్‌ల్లో అప్లోడ్ చేయాలన్నారు. తిరుపతి తారకరామారావు స్టేడియంలో జరిగే యోగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కమిషనర్ మౌర్య, పర్యాటక శాఖ ఆర్‌డి రమణప్రసాద్, పంచాయతీ అధికారి కలెక్టర్‌కు వివరించారు.

టిటిడి ఏర్పాట్లు పూర్తి : జేఈవో

ప్రపంచవ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి టిటిడి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం వెల్లడించారు. తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలోని పెరేడ్ గ్రౌండ్ లో శనివారం ఉదయం 6.30 గంటలకు యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. టిటిడి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దాదాపు 1500 మంది వరకు యోగాసనాలు చేసేలా ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. టిటిడి ఉద్యోగులు, సిబ్బంది, టిటిడి కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు హాజరుకానున్నారు. పెరేడ్ గ్రౌండ్ కు యోగాసనాలు చేసేందుకు వచ్చిన వారికి అల్పాహారం, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.



శ్రీసిటీకి మెరుగైన విద్యుత్ సరఫరా: సిఎండి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సత్యవేడు సెజ్ పరిధిలోని శ్రీసిటీకి మెరుగైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు తెలిపారు. శ్రీసిటీలోని విద్యుత్ విభాగపు అధికారులతో ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కె. సంతోష రావు శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను అనుగుణంగా పరిశ్రమలకు 24 గంటలూ విద్యుత్ సరఫరాను అందించేందుకు కషి చేస్తున్నామని తెలియజేశారు. శ్రీసిటీలో నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం బ్రేకర్స్ నిర్వహణా పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. విద్యుత్ అంతరాయాలను నిరోధించేందుకు వీలుగా కొత్త రిలేస్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక పరిశ్రమ పరిధిలో అంతర్గత విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకున్నట్లయితే అంతరాయాలను పూర్తి స్థాయిలో నిరోధించేందుకు అవకాశం వుంటుందన్నారు. అంతర్గత విద్యుత్ సమస్యల అంశాన్ని ఎపిఎస్పిడిసిఎల్ అధికారుల దష్టికి తీసుకురావడం ద్వారా సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించేందుకు అవకాశం వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ డిఎస్ వరకుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. సురేంద్ర నాయుడు, డివిజనల్ ఇంజనీర్లు ఎన్. దేవాశీర్వాదం, పి. రవికుమార్, ఎపిట్రాన్స్కో డైరెక్టర్ జెవి రావు, చీఫ్ ఇంజనీర్ డివి కిషోర్ కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కరుణాకర్, శ్రీసిటీ జనరల్ మేనేజర్ డి. నరసింహారెడ్డి. పాల్గొన్నారు.



సచివాలయ బదిలీలు సొంత మండలాల్లోనే కల్పించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ, మండల పరిధిలోనే సచివాలయ బదిలీలకు అవకాశం కల్పించాలని రాష్ట్ర అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బదిలీల జీవో5 వల్ల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు మానసికంగా ఆందోళన చెందుతున్నారన్నారు. సొంత మండలం, సొంత మున్సిపాలిటీల్లోనే బదిలీల అవకాశం కల్పిస్తూ జీవోను సవరించాలన్నారు. సొంత మండలాల్లో పనిచేయకూడదనే నిబంధన ఎంతవరకు సమంజసమని, చాలీచాలని జీతాలతో రికార్డు అసిస్టెంట్ కన్నా తక్కువ పే స్కేల్ ఉన్న ఉద్యోగులను సొంత మండలాల్లోనూ, సొంత మున్సిపాలిటీల్లోనూ అవకాశం కల్పించాలన్నారు. అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు పెండింగ్ ఉన్నాయన్నారు. 2లక్షల 40వేల మంది వాలంటీర్లు చేస్తున్న పనిని ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులతో అనేక సర్వేలు చేయిస్తూ తలకు మించిన భారాన్ని మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నీలకంఠేశ్వర్, విద్యాసాగర్, సురేష్, లోకేష్, నాగమోహన్, నవీన్, గణేష్, నరేంద్ర, సుధారాణి, గీత, మణెమ్మ, లక్ష్మీప్రియ, లావణ్య, స్వాతి, రూపాదేవి, కవిత, సరస్వతి పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'రక్తదానం చేసి ప్రాణదాతలు కండి' అని శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, స్టేట్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ పిలుపునిచ్చారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో కచ్చపి ఆడిటోరియంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. భారీ కేక్ కట్‌చేసి శ్రేణులకు పంచిపెట్టారు. స్వచ్ఛందంగా అభిమానులు, కార్యకర్తలు దాదాపు 300 మంది రక్తదానం చేశారు. గత ఎన్నికల్లో నారా భువనేశ్వరి చంద్రబాబుతో సమానంగా రాష్ట్రంలో పర్యటించి మహిళలందరినీ చైతన్యపరచి, పార్టీ అధికారంలోకి రావడానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు



కార్మికులా..కట్టు బానిసలా ..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, యంత్రాంగం

నాలుగు లేబర్ కోడ్లు..పది గంటల పని విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలంటూ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులను కట్టు బానిసలుగా చూస్తున్న సీఎం చంద్రబాబు తీరు మారకుంటే తగిన పర్యావసానాలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కత్తి రవి సంయుక్తంగా మాట్లాడుతూ కార్మికులు రక్తం చిందించి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. కార్మిక హక్కులను కాలరాసేలా, కార్పొరేట్లకు ఎర్ర తివాచీ పరిచేలా నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల అణచివేత కారణంగానే గత జగన్ ప్రభుత్వం కుప్ప కూలిందనీ, ఆ తరహా విధానాలను అమలు చేస్తే కూటమి ప్రభుత్వానికీ కార్మికులు ఘోరీ కడతారని హెచ్చరించారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు నిద్ర మేల్కొని పది గంటల పని విధానంపై పునరాలోచించాలని కోరారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జూలై 9న జరిగే దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు గంధం మణి, వెంకటేష్, గురునాథం, ఏఐటీయూసీ నాయకులు గోపి, మురళి, అయ్యప్ప, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో..

- పుత్తూరు టౌన్‌లో... పని గంటల పెంపుపై సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో పుత్తూరు అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. వి.కార్తీక్ అధ్యక్షత వహించారు. సిఐటికయు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, ఎఐటియుసి జిల్లా సమితి సభ్యులు డి.మహేష్, పుత్తూరు పట్టణ కార్యదర్శి కె.గోపి మాట్లాడుతూ ఇకపై పది గంటలు పనిచేయాలన్న క్యాబినెట్ తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. కార్పొరేట్‌తో కుమ్మక్కయిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి తూట్లు పొడుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, సతీష్, కందస్వామి, సెల్వరాజాచారి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో కార్మిక సంఘాల నిరసనలు

- పాకాలలో.. సిఐటియు నాయకులు మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆటోస్టాండ్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఆనంద్, మురళి, రాజు, లక్ష్మయ్య, వెంకటరమణ, మురళి, జనార్ధన్ పాల్గొన్నారు.

- తిరుపతి టౌన్‌లో... ఆర్డీవో కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సిఐటియు జిల్లా అద్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 12 గంటల పని విధాన నిర్ణయం మంచిది కాదన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చేలా చట్టాలను మార్చడం అన్యాయం అన్నారు. మహిళలు రాత్రుల్లో డ్యూటీ చేసేలా ఈ చట్టంలో తీసుకొచ్చారన్నారు. నాయకులు జయచంద్ర, మునిరాజ, మాధవ్, వేణుగోపాల్, బుజ్జమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌డి శ్రీను, వెంకటరత్నం పాల్గొన్నారు.

- రేణిగుంటలో.. తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. వైఎస్ మణి, హరి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి 'రెవెన్యూ' శాఖ

ప్రజాశక్తి : తిరుపతి టౌన్, యంత్రాంగం

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండే రెవెన్యూ శాఖ, ప్రజలతో మమేకమై విధులను నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో రెండో రెవెన్యూ దినోత్సవ కార్యక్రమాన్ని జేసీ శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లతో కలిసి ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ డే సెలబ్రేషన్లు జరుగుతున్నాయన్నారు. రెవెన్యూ శాఖ ప్రాధాన్యత ఉన్న శాఖ అని,ప్రతి కలెక్టరూ రెవెన్యూ శాఖతోనే ముడిపడి ఉంటారన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటూ ఇబ్బంది పెడుతున్నారనే అపోహ ప్రజల్లో ఉందని, అలాంటి అపోహలు రాకుండా చూడాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ప్రతి ఒక్కరూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, రాష్ట్ర సెక్రటరీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ అవసరమని అన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్, శివశంకర్ నాయక్, ల్యాండ్ అండ్ సర్వే శాఖ అధికారి అరుణ్ కుమార్, సి పి ఓ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డిఆర్‌ఓ బాబయ్య, పాల్గొన్నారు

- తొట్టంబేడులో..డిప్యూటీ తహశీల్దార్ జగన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రతి ఉద్యోగీ చిత్తశుద్ధితో పనిచేసి రెవెన్యూ పరంగా ప్రజలకు ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

- దొరవారిసత్రంలో.. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రాయల్, సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, మండల సర్వే నాగరాజ్, విలేజ్ సర్వే బాలకష్ణ, ఏ ఎస్ ఓ మోహన్ పాల్గొన్నారు.

- ఏర్పేడులో... తహశీల్దార్ భార్గవి అధ్యక్షతన రెవెన్యూ రికార్డులను ప్రదర్శించారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులను సన్మానించారు. ఉప తహశీల్దార్ ప్రేమ్‌సాయి శ్రీనివాస్, రోజా, ఆర్ఐ సుబ్రమణ్యం, సర్వేయర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.



ఏర్పేడులో..

- పుత్తూరు టౌన్‌లో... భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమని రాష్ట్ర పద్మశ్శాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగం రెడ్డి కొనియాడారు. శుక్రవారం పుత్తూరు మండల కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన కేక్‌కట్ చేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ గురుస్వామి, పట్టణ అధ్యక్షులు గాలిజీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మార్కెట్ కమిటి చైర్మన్ డిఎస్ గణేష్ పాల్గొన్నారు.

- చిట్టమూరులో..తహశీల్దార్ కాయల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషంగా సేవలు అందించిన రెవెన్యూ అధికారులకు, సర్వేయర్లకు సన్మానాలు చేసి, సర్టిఫికెట్లను అందజేశారు. మండల అభివృద్ధి అధికారి మనోహర్‌గౌడ్, డిప్యూటీ తహశీల్దార్ నిరంజన్‌బాబు పాల్గొన్నారు

- కోటలో.. తహశీల్దార్ జెజెరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.



దొరవారిసత్రంలో..

ఈతాకు కొనే దిక్కులేదు..



చీపుర్ల 'మిషన్లు' ఇస్తారట..!



● గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ఏది..? ● వన సంరక్షణ సమితులు నిర్వీర్యం ●కారుచౌకగా కొంటున్న దళారులు

ప్రజాశక్తి - కెవిబిపురం

ఆదివాసీల ప్రధాన జీవనాధారం అటవీ కొండ ప్రాంతాల్లో దొరికే బాదం బంక, తేనె, ఈతాకులు. దాదాపు నెలలో మూడు వారాల పాటు అటవీ సమీప ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని ఇంటిల్లిపాది అటవీ ఉత్పత్తులను సేకరించి అమ్ముకుని జీవిస్తుంటారు. గతంలో వన సంరక్షణ సమితులు వీరి ఉత్పత్తులను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించేవారు. క్రమేపీ వనసంరక్షణ సమితులు నిర్వీర్యం అవడంతో దాదాపు దశాబ్దకాలంగా దళారులు ప్రవేశించి కారుచౌకగా ఉత్పత్తులను కొంటున్నారు. దీంతో అటవీ ప్రాంతంలో క్రూరమృగాల మధ్య వారాల తరబడి సేకరించిన ఉత్పత్తులను చాలా తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని గిరిజనులు 'ప్రజాశక్తి'తో వాపోయారు. ఈ విషయమై ఐటిడిఎ డైరెక్టర్ చందమామల కోటయ్యను సంప్రదించగా, ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే చీపుర్ల తయారీ యంత్రాలను ప్రతి గిరిజనుడికి ఇస్తామని చెప్పడం గమనార్హం.

2002లో గిరిజన కాలనీల్లో వనసంరక్షణ సమితి వారు భవనాలను ఏర్పాటు చేసి గిరిజనులు కొండలు, అడవుల నుంచి తీసుకొచ్చిన వనమూలికలను వీరు కొనుగోలు చేసేవారు. వాటికి సరపడా నగదును అందజేసేవారు. రానురాను వనసంరక్షణ సమితులు నిర్వీర్యం అవడంతో గిరిజనుల బతుకు అధ్వానంగా తయారయ్యింది. దళారులు చెప్పిందే ధర. కొండ ప్రాంతాల్లో ఈత ఆకును కోసుకొచ్చి చీపుర్లు తయారు చేసి విక్రయిస్తుంటారు. పెట్టుబడికి డబ్బులు లేకపోవడంతో వంద పుల్లలను పది రూపాయల లెక్కన అమ్ముతున్నారు. తమ వద్ద కొనుగోలు చేసిన దళారులు మార్కెట్లో వేలల్లో లాభాలను గడిస్తున్నారని వాపోయారు.


ప్రభుత్వ సాయం లేదు : నాగూరయ్య, వగత్తూరు గిరిజన కాలనీ



ప్రభుత్వం నుంచి మాకు ఎటువంటి సాయం అందడం లేదు. అడవిని నమ్ముకుని జీవిస్తున్నాం. అడవిలో దొరికే బాదం బంక, తేనె, వేపగింజలు, నెల్లికాయ, మారేడు చెక్క సేకరించి వన సంక్షేమ శాఖకు అందజేసేవాళ్లం. వారు మా ఉత్పత్తులకు సరిపడా డబ్బులను ఇచ్చేవారు. కొన్ని సంవత్సరాలుగా వారు కొనడం లేదు. దీంతో జీవనోపాధి కోల్పోయి ఈతాకు కోసుకుంటూ దళారులు ఇచ్చే డబ్బులతో బతికేస్తున్నాం.

ఉపాధి పనుల్లేవు : రమణయ్య

ఉపాధి పనులు మాకు చూపించడం లేదు. మా గిరిజన కాలనీలో 20 కుటుంబాల వాళ్లం ఉంటున్నాం. కొండల్లో దొరికే ఈతాకుపైనే నమ్ముకుని జీవిస్తున్నాం. ఈతాకు కోయడానికి అడవికి వెళితే దాదాపు నెలరోజుల పాటు భార్యాపిల్లలతో అడవిలోనే గుడారాలు వేసుకుని ఉంటాం. ఈతాకు తెస్తే ఖర్చులన్నీ పోను ఒక్కో కుటుంబానికి ఐదువేల నుంచి పదివేలు మిగులుతుంది. దళారుల ద్వారా కాకుండా, ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తే మా కష్టానికి తగిన ఆదాయం వస్తుంది. మా జీవితాలు బాగుపడతాయి.





ప్రతిపాదనలు పంపాం : చందమామల కోటయ్య, ఐటిడిఎ డైరెక్టర్, యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ఐటిడిఎ ద్వారా తేనె, బూరగ బంక, నెల్లికాయ, మారేడుచెక్క, వేపగింజలు, కొనగ గింజలు, నేరేడు గింజనులు కొనుగోలు చేస్తున్నాం. ఈతాకును కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు పంపాము. ఈ ప్రతిపాదన వస్తే ఐటిడిఎ ద్వారా ప్రతి ఎస్టీ కాలనీకి ఈతాకు నుంచి చీపురు తయారు చేసే మిషన్లను ప్రతి గిరిజనుడికి అందజేస్తాం. వాటినుంచి తయారయ్యే పొరక కట్టలను వారి ఇంటి వద్దకే వచ్చి కట్టకు 50 రూపాయల లెక్కన ప్రభుత్వం అందజేసేలా మార్గదర్శకాలు ఏర్పాటు చేస్తున్నాం. ఐటిడిఎ ద్వారా కొనుగోలు చేయడం వల్ల దళారుల బెడద ఉండదు.

డ్రగ్స్ రవాణా చట్ట వ్యతిరేకం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాదకద్రవ్యాల వల్ల అనేక దుష్ప్రభావాలు కలుగుతాయని డాక్టర్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. 26వ తేదీ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోటేశ్వరయ్య, వీరయ్య, అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బాబు రావు, డాక్టర్ మస్తాన నరసింహులు తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, బుచ్చినాయుడు కండ్రిగ సబ్ స్టేషన్ పరిధిలో జూన్ శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక విద్యుత్ శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం మూడు లైన్ల విద్యుదీకరణ పనులు జరుగుతున్న నేపథ్యం, నర్సింగ్ మరమ్మతు, విద్యుత్ స్తంభాల వద్ద చెట్లు తొలగింపు వంటి పనులు చేయడానికి వీలుగా విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

ఉద్యోగులకు ఘన సన్మానం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల పరిషత్ కార్యాలయంలో ఏళ్ల పనిచేస్తున్న రఘురామయ్య దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం నుండి ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా దొరవారిసత్రం ఎంపీడీవో గోవర్ధన, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. మండల పరిధిలో శివాజీ, కుప్పుస్వామి, నరేష్, మునిరాజులు కూడా బదిలీ కాగా వారిని కూడా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాసుదేవయ్య, పంచాయతీ కార్యదర్శులు, రామయ్య, మధు, ఖాదర్ బాషా, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటాల బహూకరణ

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని ఎంపీడీవో, వెలుగు, హౌసింగ్, ఉపాధి హామీ కార్యాలయాలయాలకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చిత్రపటాలను శనివారం రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో బహూకరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఏ.బాలాజీ, ప్రధానకార్యదర్శి వెంకటేష్, తడుకు సర్పంచ్ బొమ్మిలి యాదవ్, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు కరుణా యాదవ్, మోహన్ రాజు, మహేష్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పద్మావతిపురం, వైసీపీ కార్యాలయంలో యువజన విభాగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'యువత పోరు' కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సిపి ఉమ్మడి జిల్లా యువజన విభాగ అధ్యక్షులు ఉదయ వంశీ మాట్లాడుతూ పార్టీ నాయకులు సూచనల మేరకు యువత పోరుతో పేరుతో యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి, వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో నగర యువజన విభాగం అధ్యక్షుడు దినేష్ రాయల్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఓబుల్ రెడ్డి, మల్లం రవి, తిరుమల రెడ్డి, శశి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ ఆదా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తుందని, బ్యాంకు లోన్ మంజూరు చేయడం జరుగుతుందని, సోలార్ కరెంటు వల్ల విద్యుత్ ఖర్చును ఆదా చేసుకోవచ్చని గూడూరు ఎలక్ట్రికల్ ఈఈ నరేందర్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఈ విషయమై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోలార్ కంపెనీల ప్రతినిధులు, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకే క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిపుత్ర ఫౌండేషన్ అధ్యక్షులు జవర్ధన్ మాట్లాడుతూ గిరిజన యువకుల్లో క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు ఈ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 24 టీంలు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని, గూడూరు, నెల్లూరు, కావలి మూడు డివిజన్లకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొనడం జరుగుతుందని, ఇందులో గెలుపొందిన వారికి నెల్లూరులో ఫైనల్ మ్యాచ్ ఉంటుందని తెలియజేశారు. అనంతరం మ్యాచ్‌ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఏంసీ మెంబర్ మాకాని వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ నెల్లూరు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ పల్లిపాకు నాగరాజు ఆధ్వర్యంలో కూరపత్తివారిపల్లి పంచాయతీ, గంపలమాదిగపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా ఇన్చార్జ్ వర్ల దేవదాసు మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎమ్మార్పీఎస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ గ్రామస్థాయి కమిటీనీ ఎన్నుకొని దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కత్తి ఓబులేసు, ధర్మరాజు, అంజి, సుబ్రహ్మణ్యం, మహేష్, గిరి, వెంకట్రామయ్య, బాబు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ 2025-2026 నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకోవడం జరిగినది. అధ్యక్షుడుగా సుధాకర్, సెక్రెటరీగా మురళీకృష్ణ, ట్రెజరర్‌గా గోపీనాథ్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై ఒకటో తేదీ నుంచి నూతన సభ్యులు సేవ చేసే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ సంవత్సరం క్లబ్ అధ్యక్షులు మనోజ్ పేద ప్రజలకు, కుట్టు శిక్షణకు తన వంతు సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ జోన్ చైర్మన్ మురళి నాయుడు, గురునాథం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామారావును బదిలీ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో రామారావుని బదిలీ చేయాలని కోరుతూ చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి రెండవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ నాయకులు పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్యలు మాట్లాడుతూ శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని బదిలీ చేయాలని, పారిశుధ్య విభాగం నుండి పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గత పది సంవత్సరముల నుండి వెంకటగిరిలోనే తిష్ట వేసి విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని వెంటనే బదిలీ చేయాలని, అప్పటివరకు పారిశుధ్య విభాగం నుండి తప్పించాలన్నారు. రామారావుని బదిలీ చేసేంతవరకు పోరాటం ఆగదన్నారు. డైలీ వేజెస్ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు, ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినోత్సవం సందర్భంగా పుత్తూరు మున్సిపాలిటీ, కార్వేటి నగరం రోడ్డు కూడలి వద్ద ఎన్టీఆర్, ముద్దు కృష్ణమ్మ నాయుడు విగ్రహాల వద్ద టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, బాలాజీ, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, వెంకటేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టిడిపి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పుత్తూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బిసిఆర్ యుగంధర్, కరుణా యాదవ్, కుప్పయ్య, గజపతి, పుత్తూరు పట్టణ, రూరల్ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భూస్వాముల చేతుల్లో ప్రభుత్వ భూములు

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, తాల్వాయిపాడులో సూళ్లూరుపేటకు చెందిన భూ స్వామి తాల్వాయిపాడులో కొంత పొలాన్ని కొనుగోలు చేసి దాని పక్కనే ఉన్న సర్వే నంబర్ 86-8,11,12 లో 29 సెంట్లు గయాలి భూమిని ఆక్రమించాడు. ఈ విషయమై గ్రామస్తులు గ్రామసభల్లో అర్జీలు ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించలేదు. గ్రామస్థాయి రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఇది కొనసాగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గయాలి భూమి ఆక్రమణ విషయమై పెళ్లకూరు తహశీల్దార్ ను వివరణ కోరగా ఆక్రమణ విషయం తన దృష్టికి వచ్చిందని, దీనికి సంబంధించి ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి గ్రామానికి న్యాయం చేస్తామని తెలిపారు.

వెంకటాపురంలో పోలీసుల పల్లె నిద్ర


ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, వెంకటాపురంలో పోలీసులు శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పోలీసుల చట్టాలను వివరించారు. అనంతరం పిల్లలకి బుక్స్ మరియు పెన్నులు పంచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జయ చంద్ర, అరుణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు ఇంచార్జీ తహశీల్దార్‌గా ఆర్‌వి ప్రసాద్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఇంచార్జీ తహశీల్దార్‌గా ఆర్‌వి ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గూడూరు తహశీల్దార్‌గా పని చేస్తున్న చంద్ర శేఖర్ సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా నాదెండ్లకు బదిలీ అయ్యారు. దీనితో ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ ఆర్‌వి ప్రసాద్‌ను ఇంచార్జీ తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ వేతనాలు పెంచాలి



ప్రజాశక్తి - సత్యవేడు : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ వేతనాలు పెంచాలని యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ డిమాండ్ చేశారు. శుక్రవారం సత్యవేడు మండల కేంద్రంలో ప్రాజెక్టు ప్రథమ మహాసభ జరిగింది. యూనియన్ అధ్యక్షులు పద్మలీల, ట్రెజరర్ రాజేశ్వరి, సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవేడు ప్రాజెక్టు అంగన్‌వాడీ నూతన కమిటీ ఏర్పాటయ్యింది. కార్యదర్శిగా సి.నిర్మల, అధ్యక్షులుగా డి.శాంతి ఎంపికయ్యారు. సత్యవేడు సెక్టార్‌కు భువన, ఝాన్సీ, కాంతమ్మ, ఇరుకులం సెక్టార్‌కు అనిల, ఇందిర, వరదయ్యపాలెం సెక్టార్‌కు శారద, అనూష, వందన, మంజుల, జ్యోత్స్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాణిశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాలు పెంచాలని, యాప్‌లకు సంబంధించి ఓటిపి విధానాన్ని రద్దు చేయాలని, ఫొటో క్యాప్చర్ హాజరు విధానాన్ని ఎత్తేయాలన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై 23న కలెక్టరేట్ల వద్ద జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ డిమాండ్‌చేశారు.

అక్టోబర్2 లోపు చెత్తనిర్వహణ పూర్తవ్వాలి : కమిషనర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : రామాపురం డంపింగ్ యార్డ్‌లో ఉన్న చెత్తను అక్టోబర్ 2 లోపు నిర్వహణ పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రామాపురంలోని చెత్త డంపింగ్ యార్డును అధికారులతో కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డులో ఉన్న చెత్త నిర్వహణ అక్టోబర్ 2లోపు పూర్తి చేయాలని అన్నారు. యంత్రాలు, కార్మికులను పెంచి త్వరగా చేయాలని అన్నారు. అలాగే పరిసర ప్రాంతాల్లో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా మొత్తం నిర్వహణ చేయాలని అన్నారు. ప్రతిరోజూ ఎంత చెత్త నిర్వహణ చేస్తున్నారనే విషయాలను ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, జిగ్నా సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి.. తిరుపతి నియోజకవర్గ పరిధిలో అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను విఎస్‌ఓలు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహశీల్దార్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

తిరుమలలో ఓ ఉన్నతాధికారి అవహేళన : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుమలలో అపచారం జరపడానికి ఓ ఉన్నతాధికారి ప్రయత్నం చేస్తున్నాడని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. పద్మావతిపురం లోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తరతరాలుగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వేద పారాయణాన్ని ఓ అధికారి అవమేళన చేస్తూ 'వేదం ఎవరికీ అర్థం అవుతుంది' అని మాట్లాడారన్నారు. టిటిడి ఆధ్వర్యంలో ఆరు వేద పాఠశాలలు నడుస్తున్నాయని, తిరుమలలో 120 ఏళ్లుగా వేద పాఠశాల నడుస్తోందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వేద విశ్వ విద్యాలయాన్ని తిరుపతిలో స్థాపించారని, వేద పారాయణ కోసం 700 పోస్టులను కేటాయించారని గుర్తు చేశారు. శ్రీవారి ఆలయంలో 56 మంది వేదపారాయణదారులు ఉంటే, వీరిలో 26 మంది రిటైర్ అయ్యారన్నారు. ఎయిర్‌పోర్టులో ప్రయాణికులను తనిఖీ చేసినట్లు ప్రధాన అర్చకులను తనిఖీ చేస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, నల్లని బాబు పాల్గొన్నారు.

నిర్దిష్టమైన ఆధారాలు లేవు : టిటిడి

టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడిపై చేసిన ఆరోపణలు అవాస్తవమని, అభూతకల్పనలని టిటిడి ఓ ప్రకటనలో ఖండించింది. ప్రస్తుతం శ్రీవారి ఆలయంలో వేద పారాయణాన్ని పఠించే సమయాన్ని గతం కన్నా మరింత పెంచడమే కాకుండా పూర్తిస్థాయిలో స్థిరీకరించామన్నారు. అర్చకులను తనిఖీ చేస్తున్నారన్నది పూర్తిగా వాస్తవదూరమని అన్నారు. గతంలో టిటిడి కేటాయించిన స్థలానికన్నా ఎక్కువ స్థానం ఆక్రమించి నిర్మాణం చేపట్టినందుకు కోర్టు ఆదేశాల మేరకు విశాఖ శారదాపీఠం, మరో రెండు మఠాలపై నోటీసులు జారీ చేశామన్నారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : భువనేశ్వరి జన్మదిన వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. బొజ్జల బృందమ్మ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు.

ప్రజాశక్తి - పెళ్ళకూరు: పెళ్లకూరు మండలంలోని పెళ్లకూరు సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడు ఇంటి వద్ద టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం భువనేశ్వరి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శాప్ చైర్మన్ రవినాయుడు సభ్యుల ఆధ్వర్యంలో తిరుపతి, రుయా ఆసుపత్రి వద్ద శుక్రవారం భువనేశ్వరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు.

నేడు ఎస్వీయూ స్టేడియంలో 'యోగాంధ్ర'

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో శనివారం జరుగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి ఏర్పాట్లు చేసినట్లు ఎస్వీయూ ఇంచార్జీ ఉపకులపతి, రిజిస్ట్రార్‌లు తెలిపారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడ కండ్రిగ: మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సామూహిక యోగా నిర్వహించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో యోగా మాస్టర్ కుమరవేలు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగే యోగా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని క్లస్టర్ ఇంచార్జి కొట్టే శివకుమార్ విజ్ఞప్తి చేశారు.

మా భూమిపై తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి జిల్లా, పిచ్చటూరు మండలం, రామగిరి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలో సర్వేనెంబర్ 176-2 లోని 80 సెంట్లు తన సెటిల్మెంట్ భూమి అని, తన ప్రమేయం లేకుండా 2011లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారని బాధితుడు ఎలుమలై రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తనకు ఇద్దరు అక్కలు ఉన్నారని రాణమ్మ, రామాంజమ్మల్ వీరు ఇరువురు తన సంతకం లేకుండానే అప్పటి సబ్ రిజిస్టర్, మండల తహసిల్దార్ కుట్ర చేసి భూమిని వేరొకరిపై తప్పుగా రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అప్పటినుండి అధికారుల చుట్టూ తిరుగుతున్న ఎవరూ పట్టించుకోలేదని, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి నేతలను భయపెట్టాలని చూస్తున్నారు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూటమి నేతలను టార్గెట్ చేసుకొని భయపెట్టాలని చూస్తున్నారని, ఇలాంటి బెదిరింపులకు భయపడనని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హాయంలో ఏదో నీతివంతమైన పాలన జరిగిన విధంగా కబుర్లు చెబుతున్నారని, తిరుపతిలో జరిగిన టౌన్ బ్యాంక్ ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికలు ఎలా జరిగాయో ప్రజలందరికీ తెలుసన్నారు. వైసీపీ అరాచకాలు భరించలేక రాష్ట్ర ప్రజలు కూటమి పార్టీలను గెలిపించారని గుర్తు చేశారు. ఇకనైనా బెదిరింపు కార్యక్రమాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

కార్పొరేటర్ నుండి కాపాడండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కార్పొరేటర్ తమ స్థలాన్ని దోచుకోవడానికి బెదిరిస్తూ దూషణలకు దిగుతున్నాడని, దళితులమయిన మాకు న్యాయం చేయాలని, తిరుపతి సంజయ్ గాంధీ కాలనీలో నివాసం ఉండే రంగయ్య అధికారులను వేడుకున్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటగిరి ప్రాంతం నుండి పొట్టకూటి కోసం వచ్చి కూలి పనులు చేసుకుని గత పదేళ్లుగా తిరుపతిలో జీవనం సాగిస్తున్నామని, తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ నరేంద్ర, కొంతమంది కలిసి తాము ఏడేళ్ల ముందు రూ.9 లక్షల రూపాయలకు కొనుగోలు చేసిన ఐదున్నర అంకణాల స్థలం కోసం తమకు విక్రయం చేసిన యజమానిని దూషిస్తూ తమ స్థలాన్ని చేజిక్కించుకోవడానికి తమపై దాడికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

భూ సమస్య పరిష్కారానికి అర్జీలు ఇస్తూనే ఉన్నాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాకు పిత్రార్జితంగా సంక్రమించాల్సిన భూమిని కొంతమంది దురుద్దేశం పూర్వకంగా ఆక్రమించారని, దీనిపై సమగ్ర విచారణ చేసి తమ భూమిని తమకు అప్పగించాలని 12 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని, భూ సమస్య పరిష్కారం కోసం అర్జీలు ఇస్తూనే ఉన్నామని బాధితురాలు అరుణ వాపోయారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం వేలూరు గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలో ఉన్న 23 సర్వే నెంబర్లలో మా తాత, తండ్రికి సంబంధించిన ఐదు ఎకరాల భూమి ఉందన్నారు. గతంలో మా భూమిని కబ్జా చేశారని మా తమ్ముడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంటే అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందించి భూ సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రభుత్వాలు మారిన మా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని, రెవెన్యూ అధికారులను తమ సమస్య పరిష్కరించాలని కోరితే వారు ఆక్రమణదారులపై దాడులు చేయాలని సలహాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయం కోసం పోలీసులకు ఫోన్ చేస్తే తిరిగి నాపై కేసు పెడతానని బెదిరిస్తున్నారని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ప్రత్యేక రాయలసీమే మా లక్ష్యం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ప్రత్యేక రాయలసీమతోనే రాయలసీమ జిల్లాల అభివృద్ధి సాధ్యమవుతుందని అందుకే రాయలసీమ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 2008 నుండి పోరాటాలను కొనసాగిస్తున్నామని సమితి అధ్యక్షులు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్న 12 జిల్లాలను కలుపుతూ ప్రత్యేక రాయలసీమ ఏర్పాటుకై కృషి చేస్తున్నామని, ఇందుకుగాను జూలై 13వ తేదీన అనంతపురంలో ప్లీనరీ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో కృష్ణ, వలి, ఖాసిం పాల్గొన్నారు.

23న శ్రీకాళహస్తికి షర్మిల రాక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జిల్లాల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఈ నెల 23న శ్రీకాళహస్తికి రానున్నారు. ఆ పర్యటన వివరాలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు వెల్లడించారు. పట్టణంలో ర్యాలీ అనంతరం స్థానిక ఆర్జిఆర్ కళ్యాణ మండపంలో షర్మిల సభ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు, నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పార్టీని సంస్థాగతంగా అభివృద్ధి చేయుటపై జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో షర్మిల దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 13న జరగాల్సిన షర్మిల సభ అహ్మదాబాద్ విమాన ఘటన కారణంగా రద్దు చేయబడిందని తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, రాజీవ్ నగర్ సెక్షన్ ఆపరేషన్ ఎస్.ఎస్ సబ్ స్టేషన్‌లో 33/11కేవీ న్యూ మారుతీనగర్, 33/11 కె.వి ఈఎస్ఐ ఫీడర్లు మరమ్మతులు, ట్రీ కటింగ్ క్లియరెన్స్‌లకోసం శనివారం 9.00 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపిఎస్పిడిసిఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ మారుతి నగర్, రాయల్ నగర్, అవిలాల, కలశం బిల్డింగ్, ఈఎస్ ఐ హాస్పిటల్, ధనలక్ష్మి నగర్, ముని రెడ్డి నగర్ తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కెరీర్ ప్లానింగ్ అండ్ గోల్ డిజైన్‌పై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డి.ఆర్.డబ్ల్యూ మహిళా కళాశాలలో కెరియర్ ప్లానింగ్ అండ్ గోల్ డిజైన్ అనే అంశంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పర్సనాలిటీ డెవలప్మెంట్ ట్రైనర్ ఉమా చంద్ పాల్గొని విద్యార్థినిలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉమాచంద్ మాట్లాడుతూ ఇంటర్ తర్వాత ఏ రంగంలోకి వెళ్లాలి, ఉన్న అవకాశాలు ఏమిటి అనే వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధించే వరకు కష్టపడాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ హనుమంతరావు, శ్రీలత, ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

అర్బన్ తహశీల్దార్‌గా సురేష్ బాబు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ తహశీల్దార్ సురేష్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ తిరుపతి అర్బన్ పరిధిలో ఉండే ప్రభుత్వ భూములు పరిరక్షించడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు సకాలంలో అన్ని సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న శెట్టిపల్లి భూములు అర్హులైన బాధితులకు అందజేసే విధంగా తమ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు.

యోగా కార్యక్రమం విజయవంతం చేయండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బియన్ కండ్రిగ గ్రామపంచాయతీ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్, ఎంపీటీసీ, వార్డ్ మెంబెర్స్, మండల అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది శనివారం జరిగే యోగ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

క్రైం న్యూస్

తెలుగుగంగ కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి



మృతి చెందిన శ్రీను

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఉమ్మడి నెల్లూరు జిల్లా దక్కిలి సమీపంలోని తెలుగుగంగ కాలువలో శుక్రవారం ఉదయం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్ళిన పల్లపు శ్రీను (24) అనే వ్యక్తి కాలువలో అధిక ప్రవాహం ఉండడంతో గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని కనుగొని కాలువనుండి వెలికి తీశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టును చూపుతున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి, నెల్లూరు జిల్లా, ఆత్మకూరు డివిజన్ అటవీ ప్రాంతంలో రూ.60 లక్షల రూపాయలు విలువైన 55 ఎర్రచందనం దుంగలు, ఒక కారు, మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్ ఆధీనంలోని ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం గురువారం ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని అనంతసాగరం ఫారెస్ట్ సెక్షన్లో కూంబింగ్ చేపట్టారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. స్థానికంగా ఉన్న అటవీ శాఖ అధికారులు టి.శ్రీనివాసులు, సిహెచ్ శ్రీనివాసుల సహాయంతో అక్కడి లోడింగ్ పాయింట్లు తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా గుడిగుంట ప్రాంతంలో కొంతమంది కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారన్నారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు దగ్గరకు వెళ్ళగా కొంతమంది పారిపోయారని అందులో నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన నలుగురు స్మగ్లర్లు చెన్నై నగర పరిసరాలకు చెందినవారుగా గుర్తించమన్నారు. దీనిపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో సిఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు దొంగలు అరెస్టు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఇళ్లల్లో చోరీలు, బైకు దొంగతనాల కేసుల్లో ఇద్దరు దొంగలను టూ టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. టూ టౌన్ పరిధిలోని కైలాసగిరి కాలనీ, జర్నలిస్ట్ కాలనీలో గతేడాది ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఈ చోరీల్లో నిందితుడుగా ఉన్న కావడి సోమశేఖర్(29) పీలేరు సబ్ జైలు నుంచి పీటీ వారెంట్ కింద అరెస్టు చేసి తీసుకొచ్చారు. అదేవిధంగా బహుదూర్ పేట, ఇతరత్రా ప్రాంతాల్లో బైకు దొంగతనాలకు పాల్పడిన అదంషా(17) అనే దొంగను వాహన తనిఖీల్లో అరెస్టు చేశారు. ఒకరు పారిపోయారు. ఇరువురిని శ్రీకాళహస్తి కోర్టులో హాజరపరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

ఎస్డీకే నగర్‌లో డ్రగ్స్ కలకలం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని దక్షిణ కైలాస నగర్ శివారు ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు సమీపంలో యువత గంజాయి, డ్రగ్స్, మద్యం సేవిస్తున్నట్లు స్థానికుల నుంచి టూ టౌన్ పోలీసులకు శుక్రవారం సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు దాడి చేయగా యువకులు పరారయ్యారు. ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనంతో పాటు డ్రగ్స్‌కు వినియోగించే మైక్రో సిరంజిలు, నీడిళ్ళు, మద్యం బాటిల్లు, గంజాయి బీడీలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. యువకుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సిఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

యాక్సిడెంట్ కేసు కొట్టివేత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని బసవయ్య పాలెం చెక్ పోస్టు వద్ద 2017లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా అందుకు బాధ్యుడైన బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ పై టూ టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం శ్రీకాళహస్తి కోర్టు కొట్టి వేసింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో సెక్షన్ 304-ఏ, 338 ఐపీసీ కింద నమోదైన కేసులో నిందితున్ని న్యాయమూర్తి జోరేపల్లి కృష్ణ ప్రియ అపరాధిగా నిర్ధారిస్తూ తీర్పునిచ్చినట్లు డిఫెన్స్ క్రిమినల్ లాయర్ విప్పరపల్లి సాయిరాం తెలిపారు.

రేణిగుంట తహశీల్దార్‌గా చంద్రశేఖర్ రెడ్డి



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట తహశీల్దార్‌గా చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరించారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయం చేరుకున్న ఆయనను వీఆర్ఏల సంఘం నాయకుడు హరి, రెవిన్యూ సిబ్బంది శాలువాతో సన్మానించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రేణిగుంట తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న సురేష్ బాబు తిరుపతి అర్బన్‌కు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు మహేష్, నాగరాజ్, సుభాషిణి, సురేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులను మోసం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తిరపతి బ్యూరో: శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు నకిలీ దర్శన టికెట్ల పేరుతో మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని టిటిడి సివిఎస్వో మురళీ కృష్ణ హెచ్చరించారు. మార్చిలో విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థిని సంగమిత్రకు శ్రీవారి సుప్రభాత సేవ, ప్రోటోకాల్ దర్శనం, వసతి టికెట్లు ఇప్పిస్తామని మదనదీపు బాబు, సందీప్, పవన్ కుమార్‌లు రూ.2.60 లక్షలు వసూలు చేశారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల 2 టౌన్‌లో సదరు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. కొంతమంది దళారులు తాము దర్శనం టికెట్లు బుక్ చేయిస్తామని భక్తుల నుంచి ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తుండడంతో దళారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. శ్రీవారి దర్శనాల కోసం భక్తులు దళారులను ఆశ్రయించి ఇబ్బందులకు గురికావద్దని ఆయన కోరారు. తనిఖీలో టికెట్లు నకిలీగా తేలితే అనవసరమైన ఇబ్బందులు గురికావాల్సి వస్తుందన్నారు. 0877 - 2263828 నంబరుకు ఫోన్ చేసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. టిటిడి వెబ్సైట్‌లో ఆన్ లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1. 45కోట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామీ అమ్మవార్లకు, పరివార దేవతలకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం ఒక కోటీ 45 లక్షలా 39 వేలా 576 రూపాయలు వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపులు జరిగాయి. బంగారం 0.39 గ్రాములు, వెండి 503.13 కిలోలు, 106 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు డిప్యూటీఈవో కృష్ణారెడ్డి తెలిపారు.

శివయ్య సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనార్థం పలువురు ప్రముఖులు శుక్రవారం ఆలయానికి విచ్చేశారు. నేషనల్ కమిషనర్ ఆఫ్ ఉమెన్స్ న్యూఢిల్లీ డాక్టర్ అర్చన మంజుందర్, తెలంగాణ హైకోర్టు జడ్జి పుల్లా కార్తీక్, ఏపీ ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ దారు నాయక్ వీరిలో ఉన్నారు. స్వామి అమ్మవార్ల చెంత ప్రత్యేక పూజలు చేసుకున్నారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.